క్లుప్తంగా

జగనన్న గెలుపుతోనే సంక్షేమ పథకాలు



ఈవీఎంలో ఫ్యాన్‌కు ఓటు వేసే విధానాన్ని వివరిస్తున్న సర్పంచ్ అప్పాజి

కె.కోటపాడు: సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించుకోవాలని సర్పంచ్ వంటాకు అప్పాజి కోరారు. బుధవారం ఆయన ఆనందపురంలో ఇంటింటికీ తిరుగుతూ ఓటర్లకు అవగాహన కల్పించారు. ఈవీఎంల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలను గెలిపించాలని కోరారు. అందుబాటులోనే ఉండే స్థానిక నాయకులను గెలిపించుకోవడం అందరి బాధ్యత అన్నారు. మాజీ ఉప సర్పంచ్ వంటాకు మహేష్ తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లా సమస్యలను విస్మరించిన ప్రధాని

కె.కోటపాడు: అనకాపల్లి వద్ద రాజుపాలెంలో నిర్వహించిన ఎన్డీఏ సభలో ప్రధాని నరేంద్రమోదీ ఉమ్మడి జిల్లా సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇవ్వకపోవడం విచారకరమని సీపీఎం నాయకుడు రొంగలి ముత్యాలనాయుడు అన్నారు. బుధవారం కె.కోటపాడులో మాట్లాడుతూ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ, జిల్లాలో చక్కెర కర్మాగారాల మనుగడపై కనీసం ప్రస్తావించకపోవడంతో ఉద్యోగులు, రైతుల్లో తీవ్ర నిరాశ వ్యక్తమైందన్నారు. ఈ విషయమై సహాయం అందించనున్నట్లు ఇప్పటికైనా ప్రధానితో ప్రకటన చేయించాలని బీజేపీ నాయకులను కోరారు.

కాంగ్రెసు పార్టీని గెలిపించండి

మాడుగుల రూరల్: కాంగ్రెసు పార్టీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి బోడ్డు శ్రీనివాసరావు బుధవారం మాడుగులలో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. కాంగ్రెసు పార్టీని గెలిపిస్తే రాష్ట్రాన్ని ప్రగతి బాటలో నడిపిస్తామన్నారు. ఎంపీ అభ్యర్థిగా వేగి వెంకటేష్, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని కోరారు. ప్రచారంలో పార్టీ నాయకులు పడాల కొండలరావు, ఏసు రాజు, బుడబండి రాజు, నక్కా జోగారావు, మురళీ పాల్గొన్నారు.

దేవరాపల్లిలో బూడి, అనురాధ ప్రచారం నేడు

దేవరాపల్లి: వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి, డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ దేవరాపల్లి పంచాయతీల పరిధిలో గురువారం ప్రచారం నిర్వహిస్తారని పార్టీ మండల అధ్యక్షుడు బూరె బాబూరావు తెలిపారు. ఉదయం 7 గంటల ప్రాంతంలో శివారు కళ్లాల్లో బైక్‌లపై ప్రచారం చేస్తారన్నారు. అనంతరం గ్రామంలోని వీధుల్లో ప్రచారం చేస్తారన్నారు. మధ్యాహ్నం మూడు గంటలకు పెంట్రోల్ బంక్ నుంచి ప్రారంభమై నాలుగు రోడ్ల కూడలి మీదుగా ప్రధాన రహదారిలో భారీ ప్రచార ర్యాలీ నిర్వహిస్తారన్నారు. అనంతరం ప్రచార రథంపై ప్రజలను ఉద్దేశించి మాట్లాడుతారన్నారు. ఈ ప్రచార కార్యక్రమానికి పార్టీ శ్రేణులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

13న కార్మికులకు వేతనంతో కూడిన సెలవు

బుచ్చెయ్యపేట: సార్వత్రిక ఎన్నికలు సందర్భంగా కార్మికులకు వేతనంతో కూడిన సెలవును ఏపీ కార్మిక శాఖ మంజూరు చేసినట్లు చోడవరం సహాయ కార్మికశాఖ అధికారి పి. సూర్యనారాయణ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. సబ్బవరం, బుచ్చెయ్యపేట, రావికమతం, చీడికాడ, వి.మాడుగుల, కె. కోటపాడు, దేవరాపల్లి మండలాల్లోని అన్ని గ్రామాల్లో కార్మికులకు ఆయా దుకాణాల యజమానులు, సంస్థ ప్రతినిధులు వేతనంతో కూడిన సెలవు మంజూరు చేయాలన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకోకుండా సెలవు మంజూరు చేయని వారిపై 9492555018, 9948037377 ఫిర్యాదు చేయాలని కోరారు.

పోస్టల్ బ్యాలెట్ వేసిన 350 మంది ఉద్యోగులు

మాడుగుల: స్థానిక ఆర్‌సీఎం పాఠశాలలో పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను బుధవారం మూడో రోజు 350 మంది ఉద్యోగులు వినియోగించుకున్నారని ఎన్నికల రిటర్నింగ్ అధికారి జి.వి.సత్యవాణి తెలిపారు. నియోజకవర్గంలో 2,372 పోస్టల్ బ్యాలెట్లకుగాను 2,205 మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ వినియోగించుకున్నారన్నారు.

డెవలప్‌మెంట్ వాచ్



రోలుగుంట మండలం కొమరవోలు రైతు భరోసా కేంద్రం



దేవరాపల్లి మండలం తారువ రైతు భరోసా కేంద్రం



రావికమతం మండలం దొండపూడి ఆర్బీకేలో రైతులకు సబ్సిడీ విత్తనాలు అందిస్తున్న దృశ్యం



రావికమతం ఆర్బీకేలో కియోస్కో మెషీన్ ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు ఇండెంట్ పెడుతున్న దృశ్యం

రైతులకు వెన్నుదన్నుగా ఆర్బీకేలు

రావికమతం/రోలుగుంట/మాడుగుల: గ్రామాల్లో కొలువుదీరిన రైతు భరోసా కేంద్రాలు రైతులకు వరంగా మారాయనే చెప్పాలి. గత టీడీపీ పాలనలో విత్తు నుంచి ఎరువుల వరకు పొందాలంటే మండల కేంద్రాలకు కాళ్లరిగేలా తిరుగుతూ పడిగాపులు కాసేవారు. సాగు సూచనలు, సలహాలు కోసం ఎన్నో వ్యయప్రయాసలు పడేవారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా గ్రామాల్లో నిర్మించిన రైతు భరోసా కేంద్రాలు(ఆర్బీకే)తో ఒక్కసారిగా వారి కష్టాలు తీరాయి. ప్రతి సచివాలయంలో ఆర్బీకేను నిర్మించి గ్రామీణ వ్యవసాయాధికారిని అందుబాటులో ఉంచి సేవలన్నీ అందేలా చేస్తున్నారు. అధునాతన కియోస్కో మెషీన్ ద్వారానే రైతుకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు తదితర వస్తువులన్నీ స్వయంగా బుక్ చేసుకునే అవకాశాన్ని కల్పించారు.

- రావికమతం మండలంలో 22 సచివాలయాల్లో ఒక్కో ఆర్బీకేను రూ.21.8 లక్షలతో మొత్తం 22 ఆర్బీకేల నిర్మాణానికి రూ.4.62 కోట్లు వెచ్చించారు. ఒకటి రెండు గ్రామాల్లో మినహా అన్నీ చోట్లా ఇవి రైతులకు పూర్తిగా అందుబాటులోకి వచ్చాయి. రోలుగుంటలో 13, బుచ్చెయ్యపేటలో 22 చొప్పున నిర్మించారు.
- మాడుగుల నియోజకవర్గంలో మాడుగుల, దేవరాపల్లి, కె. కోటపాడు, చీడికాడ మండలాల్లో 78 ఆర్బీకేలు ఉన్నాయి. ఒక్కొక్క ఆర్బీకేను రూ.23.94 లక్షలతో ప్రతి సచివాలయ పరిధిలో నిర్మించారు. వీటి ద్వారా విత్తనాలు, ఎరువులు రైతులకు సరళమైన ధరలకు రైతులు ముంగిటకు అందుతున్నాయి.

సేవ చేసే అవకాశం కల్పించండి

- ఎన్నికల ప్రచారంలో ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ
- కె.కోటపాడులో పెద్ద ఎత్తున తరలివచ్చిన ప్రజలు, పార్టీ శ్రేణులు
- అడుగడుగునా బ్రహ్మారథం



ఎన్నికల ప్రచారంలో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి అనురాధ అభివాదం



ప్రచారంలో మహిళల కోలాటం

కె.కోటపాడు: అనునిత్యం అందుబాటులో ఉంటూ ప్రజలకు సేవ చేసే అవకాశాన్ని ఎంపీగా బూడి ముత్యాలనాయుడుకు, ఎమ్మెల్యేగా తనకు అవకాశం కల్పించాలని మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ కోరారు. ఎంపీపీ రెడ్డి జగన్‌మోహన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి కె.కోటపాడులో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పెద్ద ఎత్తున ప్రజలు, పార్టీ కార్యకర్తలు, నాయకులు తరలివచ్చారు. అనురాధకు అడుగడుగునా బ్రహ్మారథం పట్టారు. పూలు జల్లి హారతులిచ్చి ఘన స్వాగతం పలికారు. పార్టీ శ్రేణుల నినాదాలు, మహిళల కోలాటాల మధ్య సాగిన ఎన్నికల ప్రచారంలో స్థానిక మూడు రోడ్ల కూడలిలో ఆమె మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి ఐదేళ్లలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి లేని సుపరిపాలన అందించారని ప్రశంసించారు. ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం ద్వారా సంక్షేమ లబ్ధి చేకూరిందని తెలిపారు. మంచి చేస్తున్న సీఎం జగన్ ప్రభుత్వాన్ని ప్రజలు మనసారా ఓటుతో దీవించాలని కోరారు. ఈ నెల 13న ఎన్నికల్లో అనకాపల్లి ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యేగా తనకు రెండు ఓట్లును ఫ్యాన్ గుర్తుపై వేయాలని అభ్యర్థించారు. పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న ఈ ఎన్నికల్లో జగన్ పక్షాన ప్రజలు నిలబడాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎంపీపీ జగన్‌మోహన్ మాట్లాడుతూ కె.కోటపాడు మండలం నుంచి 20 ఏళ్ల తర్వాత ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసే అవకాశం లభించిందన్నారు. మండల వ్యాప్తంగా ప్రజలు ఓట్లు వేసి మంచి మెజార్టీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి దాట్ల శివాజీరాజు, వైస్ ఎంపీపీ లెక్కల నాగ విజయలక్ష్మి, మండల యువజన విభాగం అధ్యక్షుడు గొర్రుపోటు వెంకటరావు, శ్రీకాంత్ శ్రీను, ఉప సర్పంచ్ రెడ్డి అరుణ, వేచలపు దొరబాబు, చీపురుపల్లి అచ్చిబాబు, ఏటుకూరి రాజేష్, ఆకుల సాయిప్రసాద్, బండారు దేముళ్లు, బండారు ముత్యాలనాయుడు, వర్రి రాము నాయుడు, బోళెం కృష్ణారావు, సందీప్, వంటాకు అప్పాజి తదితరులు పాల్గొన్నారు.

ధర్మశ్రీ ప్రచార జోరు.. పార్టీ శ్రేణుల నినాదాల హోరు

- 13 గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం
- అడుగడుగునా జన నీరాజనం



ఎన్నికల ప్రచారంలో అభివాదం చేస్తున్న ధర్మశ్రీ



అంబేరుపురంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేస్తున్న ధర్మశ్రీ

చోడవరం: పోలింగ్‌కు కొద్దిరోజులే సమయం ఉండటంతో చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ మిగిలిన ఉన్న గ్రామాలన్నీ చుట్టేస్తున్నారు. బుధవారం ఆయన గోవాడ, వెంకన్నపాలెం, గజపతినగరం, జుత్తాడ, సింహాద్రిపురం, అంబేరుపురం, అడ్డూరు, భోగాపురం, శీమునాపల్లి, నర్సాపురం, ముద్దుర్తి, లక్కవరం గ్రామాల్లో ఆయన విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేశారు. తమ ప్రాంతానికి వచ్చిన ఆయనకు మేళతాళాలు, డప్పులు, వాయిద్యాలతో అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. నీ వెంటే మేమున్నామంటూ అడుగులో అడుగేసి ప్రచారంలో కదం తొక్కారు. తొలుత గంధవరం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇక్కడ వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పెద్దసంఖ్యలో యువకులు, మహిళలు నీరాజనం పలికారు. పూలవర్షం కురిపించి, అడుగడుగునా హారతులు పట్టారు. ప్రతీ కుటుంబాన్ని ఆప్యాయంగా పలకరిస్తూ ప్రభుత్వం ద్వారా పొందిన లబ్ధిని అడిగి తెలుసుకున్నారు. ఇంటింటికీ వెళ్లి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ పథకాలను వివరించారు. ప్రజలను ఇబ్బందులు పెట్టి వారి జీవితాలతో ఆడుకోవడం టీడీపీ నాయకులు అలవాటేనని తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. ఆయా గ్రామంలో ప్రధాన సమస్యలన్నీ పరిష్కరించామన్నారు. వెంకన్నపాలెంలో ఎస్ఈజెడ్ ఏర్పాటుకు కృషి చేస్తున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, ఎమ్మెల్యేగా తనను గెలిపించాలని అభ్యర్థించారు. ఈ ప్రచారంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి ఏడువాక సత్యారావు, జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మొల్లి సోమునాయుడు, సర్పంచ్‌లు కూర్మదాసు మాలిబాబు, కురుకుటి భోగేష్, శరగడం చిమ్మినాయుడు, నాగిరెడ్డి నారాయణమూర్తి, సూరిశెట్టి నాగుదుర్గ గోవింద, మళ్ల శ్రీను, బుద్ద గంగరాజు, ప్రసాద్, దంతులూరి శ్రీనివాసరాజు తదితరులు పాల్గొన్నారు.

నేడు 10 గ్రామాల్లో ధర్మశ్రీ ఎన్నికల ప్రచారం

బుచ్చెయ్యపేట: మండలంలోని పది గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ గురువారం ఎన్నికల ప్రచారం నిర్వహించనున్నట్లు పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. ఉదయం ఏడు గంటలకు కొమళ్లపూడి నుంచి ప్రారంభమై బుదిరెడ్లపాలెం, గంటికొర్లాం, గొల్లకొంపలు, పాత కొండెంపూడి, కొత్త కొండెంపూడి, ఐయితంపూడి, విజయరామరాజుపేట, కుముదాంపేట, మంగళాపురం గ్రామాల్లో ప్రచారం సాగుతుందన్నారు. ఆయా గ్రామాల నాయకులు, కార్యకర్తలు ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని కోరారు.

అనుమానాస్పదంగా కోళ్లు మృతి

దేవరాపల్లి: స్థానిక మెయిన్ రోడ్డులోని చికెన్ సెంటర్‌లో అనుమానాస్పద స్థితిలో కోళ్లు మృతి చెందాయి. స్థానికుల సమాచారంతో చికెన్ సెంటర్ యజమాని జామి నాయుడు బుధవారం ఉదయాన్నే అక్కడికి చేరుకున్నాడు. కోళ్లు స్టాక్ చేసిన గదికి వేసిన మెస్‌ను గుర్తు తెలియని వ్యక్తులు తొలగించి లోపలికి చొరబడి లక్ష రూపాయలు విలువ చేసే వాటి పీకలను కోసేశారని, రెండు నెలల క్రితం ఇదే తరహా ఘటన జరిగిందని బాధిత యజమాని ఆవేదన వ్యక్తం చేశాడు.

ఇంటికి పింఛన్ అందాలంటే జగనే కావాలి



మర్రివలసలో ప్రచారం చేస్తున్న నాయకులు

రావికమతం: వలంటీర్లతో ఇంటింటికీ పింఛన్ రావాలంటే మళ్లీ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ఎంపీపీ పైల రాజు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ముక్కా మహలక్ష్మినాయుడు, డీసీఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ, మండల సచివాలయ కన్వీనర్ కంచిపాటి జగన్నాథరావు తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు విజయమే లక్ష్యంగా వారంతా బుధవారం మర్రివలస, కొత్తకోట తదితర గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. వలంటీర్ ద్వారా ఇంటింటికీ పింఛన్‌తోపాటు ఇతర పథకాలు నేరుగా అందాలన్నా, పాఠశాలల్లో మన పిల్లలకు ఇంగ్లిషు మీడియంతోపాటు విలువైన చదువులు అందాలన్నా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని కోరారు. టీడీపీ మోసపూరిత హామీలు నమ్మి మోసపోవద్దని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును ఫ్యాన్ గుర్తుపై వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

టీడీపీకి ఓటు వేస్తే మన బతుకులు నరకమే

- ఎన్నికల ప్రచారంలో జెడ్పీటీసీ దొండా రాంబాబు



వడ్డాదిలో ఇంటింటా ఎన్నికల ప్రచారం చేస్తున్న నాయకులు



కేపీ అగ్రహారంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న నేతలు



బంగారుమెట్టలో పథకాలపై అవగాహన కల్పిస్తున్న నాయకులు

బుచ్చెయ్యపేట: తెలుగుదేశం పార్టీకి ఓటు వేస్తే పేదలందరి బతుకులు నరకంగా తయారవుతాయని జెడ్పీటీసీ దొండా రాంబాబు, పార్టీ మండలాధ్యక్షుడు కె. అచ్చింనాయుడు తెలిపారు. చోడవరం ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులకు మద్దతుగా బుధవారం వడ్డాది, కేపీ అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో వారు ఎన్నికల ప్రచారం చేపట్టారు. పలు గ్రామాల్లో ప్రజలు హారతులు పట్టి స్వాగతించారు. వైఎస్సార్‌సీపీ వచ్చిన ఐదేళ్లలో రెండేళ్లు కరోనాతో పాలన ఆగిపోయిన జగనన్న మాత్రం సంక్షేమ కార్యక్రమాలు ఆపకుండా ప్రతి ఇంటికి రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు లబ్ధి చేకూర్చారన్నారు. 14 ఏళ్లు పాలించిన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు చెప్పుకోవడానికి ఒక్క సంక్షేమ పథకమైనా సక్రమంగా అమలు చేశారా అని ప్రశ్నించారు. డ్వాక్రా, రైతు రుణాలు మాఫీ చేయకుండా ఇంటికొక ఉద్యోగం, నెలకు రెండు వేల రూపాయల నిరుద్యోగ భృతి ఇవ్వకుండా మోసం చేశారన్నారు. ఇప్పుడు ఇంటికి వస్తున్న పింఛన్ అందకుండా చేశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం మరలా రెండోసారి రాకపోతే సంక్షేమ పథకాలన్నీ ఆగిపోతాయని పేదలంతా తీవ్ర ఇబ్బందులు పడతారన్నారు. ప్రతి గ్రామంలో సచివాలయం, రైతు భరోసా, హెల్త్ సెంటర్, నాడు – నేడు పనులతో పాఠశాలలు అభివృద్ధి చేశామన్నారు. అందరికి మేలు చేస్తున్న వైఎస్సార్ సీపీని ఆదరించి ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు, వైస్ ఎంపీపీ దొండా లలితా నారాయణమూర్తి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు ఎస్. రమేష్, నానాజీ, గోపిశెట్టి శ్రీను, యెనుముల వాసు, ఆర్టీసీ రమణ, బాబూరావు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని చంద్రబాబు వద్దే వద్దు

- వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు
- పోతల లక్ష్మీ శ్రీనివాస్, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు



అర్ల గిరిజనలో ప్రచారం చేస్తున్న మండల యువజన విభాగం అధ్యక్షుడు రాజు, రాజారావు



రోలుగుంట బందారు వీధిలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు పోతల లక్ష్మీశ్రీనివాస్, మీద్దు తాతబాబు, వార్డు మెంబర్లు



రత్నంపేటలో ప్రచారం చేస్తున్న మాజీ సర్పచ్ తమటపు సత్యంనాయుడు

రోలుగుంట: గత టీడీపీ పాలనలో ప్రజా సమస్యలు పూర్తిగా విస్మరించి ఇచ్చిన హామీలు నెరవేర్చని చంద్రబాబునాయుడుకు ఓటెందుకు వేయాలని వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, జిల్లా కార్యవర్గ సభ్యుడు పోతల లక్ష్మీశ్రీనివాస్, ఎంపీపీ యర్రంశెట్టి శ్రీనివాసరావు, మండల శాఖ అధ్యక్షుడు గొర్లె వెంకటరామన్ ప్రశ్నించారు. ఎమ్మెల్యే అభ్యర్థి కరణం ధర్మశ్రీ, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు గెలుపు కోరుతూ బుధవారం కొవ్వూరులో యర్రంశెట్టి శ్రీనివాసరావు, కొమరవోలులో గొర్లె వెంకటరామన్, రోలుగుంటలో పోతల లక్ష్మీశ్రీనివాస్ ఎన్నికల ప్రచారాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ఇంటింటా తిరిగి ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ పాలనలో చేసిన సంక్షేమం, అభివృద్ధి గురించి వివరించారు. స్కిల్ డెవలప్‌మెంటు కేసుతోపాటు మరో 21 కేసుల్లో నుంచి బయట పడడానికే ప్రధాని మోదీ కాళ్లు పట్టుకుని బీజేపీతో జతకట్టి మోసపూరిత వాగ్దానాలు, వలంటీర్లపై ఫిర్యాదు చేసి వారి సేవలు నిలుపుదల చేశారని విమర్శించారు. ఏనాడూ ప్రజా సమస్యలు పట్టని చంద్రబాబుకు ఓటు వేయొద్దని కోరారు. రెండు ఓట్లు ఫ్యాన్ గుర్తుపై బటన్ నొక్కి వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రత్నంపేటలో మాజీ సర్పంచ్ తమటపు సత్యంనాయుడు, అర్ల గిరిజన గ్రామంలో పార్టీ మండల యవజన విభాగం అధ్యక్షుడు దోసపత్ని రాజు, బాణం రాజారావు, వండలపు వణిత ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

చల్లబడ్డ వాతావరణం

మాడుగుల రూరల్: మండలంలో బుధవారం సాయంత్రం వాతావరణం చల్లబడి వర్షం కురిసింది. ఉదయం నుంచి ఎండ తీవ్రత, సాయంత్రం ఆకాశం కారుమబ్బులు పట్టింది. అరగంట సేపు కురిసిన వర్షంతో వాతావరణం చల్లబడింది. ఈ వర్షంతో గ్రామాల్లో చెరకు నాట్లు వెయ్యడానికి రైతులు సమాయత్తం అవుతున్నారు. కూరగాయలు, చెరకు కార్శి తోటలకు ఎంతో అనుకూలంగా ఉంటుందని చెబుతున్నారు.

గ్రామాల్లో జోరుగా ఎన్నికల ప్రచారం



కింతలిలో ప్రచారం చేస్తున్న పార్టీ నాయకుడు జామి చిన్న



ముకుందపురంలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ గణేష్



ఎం.కె. వల్లాపురంలో మహిళలతో ప్రచారం చేస్తున్న ఉప సర్పంచ్ రాము

మాడుగుల రూరల్: వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు మద్దతుగా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, అభిమానులు విస్తృతంగా ఎన్నికల ప్రచారం చేపట్టారు. ప్రధానంగా వి.వి.ప్యాట్లతో ఓటు ఎలా వేయాలో ఓటర్లకు అవగాహన కల్పిస్తున్నారు. ముకుందపురంలో సర్పంచ్ కర్రి గణేశ్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి వి.వి.ప్యాట్లతో అవగాహన పరిచారు. ఎంపీ అభ్యర్థిగా బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలను గెలిపించాలని కోరారు. కింతలిలో గ్రామ శాఖ అధ్యక్షుడు జామి చిన్న ఆధ్వర్యంలో ప్రచారం చేపట్టారు. మహిళలతో సమావేశమై చైతన్యవంతం చేశారు. ఎం.కె. వల్లాపురంలో ఉప సర్పంచ్, పార్టీ నాయకుడు కరణం రాము, కె.జె.పురంలో స్థానిక నాయకులు ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ఐదేళ్ల పాలనలో చేసిన అభివృద్ధిని వివరించారు.

పేదల కోసం పరితపించే జగన్‌ను గెలిపిద్దాం

- వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు బూరె బాబూరావు



కరపత్రాలు అందజేస్తున్న బూరె బాబూరావు

దేవరాపల్లి: పేదల సంక్షేమం కోసం నిత్యం పరితపించే జగన్‌మోహన్‌రెడ్డిని మరో మారు ముఖ్యమంత్రిగా గెలిపించుకుందామని వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు, సర్పంచ్ బూరె బాబూరావు అన్నారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలకు మద్దతుగా బోయిలకింతాడలో ఇంటింటా ప్రచారం చేపట్టారు. ప్రతీ ఇంటా ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. ప్రస్తుత సంక్షేమ పథకాలు అమలు కావాలన్నా, అవ్వాతాతలకు, వితంతువులకు, దివ్యాంగులకు ఇంటి దగ్గరే పింఛన్ అందాలన్నా జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించడంతోపాటు బోయిలకింతాడ గ్రామాన్ని అభివృద్ధిలో ఆదర్శంగా తీర్చిదిద్దిన అనకాపల్లి ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును, మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధలకు ఫ్యాన్ గుర్తుపై ఓటేసి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. రాజకీయ పార్టీలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించే జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. చంద్రబాబు మోసపూరిత హామీలను నమ్మి మోసపోవద్దని సూచించారు.

ప్రశాంత ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు

మాడుగుల: నియోజకవర్గంలో ఈ నెల 13వ తేదీన జరగనున్న సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి ఏర్పాట్లు చేశామని ఆర్వో జి.వి.సత్యవాణి తెలిపారు. నాలుగు మండలాల ఎస్ఐలతో తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. నియోజకరవ్గంలో 235 పోలింగ్ కేంద్రాల్లో తాగు నీరు, విద్యుత్ తదితర సదుపాయాలు కల్పించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టి బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రతలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ స్వామినాయుడు, ఎస్ఐలు లక్ష్మీనారాయణ, దామోదరనాయుడు, కె. నారాయణరావు, డి. నాగేంద్ర, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పోలీసులతో సమీక్షిస్తున్న ఆర్వో సత్యవాణి